క్లుప్తంగా

సంపద తయారీ కేంద్రం పరిశీలించిన డీఎల్‌పీవో



మునగపాక సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించిన డీఎల్‌పీవో మూర్తి

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలో సోమవారం డీఎల్‌పీవో మూర్తి పర్యటించారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఇంతవరకు జరిగిన వ్యాపారానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులను పరిశీలించారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. సీజన్‌లో ఎటువంటి వ్యాధులు సోకకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, ఏఎన్‌ఎంలు దేవకి, రేవతి, మహిళా పోలీసు వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్షా బంధన్ జరుపుకోవాలి



సమరసతా ఫౌండేషన్ మండల సమావేశంలో పాల్గొన్న సభ్యులు

నక్కపల్లి : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ రక్షాబంధన్ నిర్వహించుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ మండ సంజయ్ నీలాపు వెంకటరెడ్డి అన్నారు. ఈ నెల 16 వ తేదీన నుండి 22 వరకు రక్షాబంధన్ ప్రతి ఒక్కరూ జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో వారానికి ఒక రోజు సత్సంగం జరుపుకోవాలని, ఏకాదశి రోజున నగర సంకీర్తన జరుపుకోవాలన్నారు. పాయకరావుపేట మండలంలో గల రాజానగరం రామాలయంలో జరిగిన ఈ సమావేశంలో మండ సంజయక్, తాడి గురుమూర్తి, ధర్మ ప్రచారక్ కట్టా వీరబాబు, సభ్యులు చేపల అప్పలరాజు, గరికిన సూరిబాబు, పిరాధి రాజు పాల్గొన్నారు.


ఎస్‌ఎంసీ ఎన్నికలు సజావుగా జరగాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక : స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మండల స్థాయి హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న జరగనున్న స్కూల్ కమిటీ ఎన్నికల్లో ఎటువంటి గొడవలకు అవకాశం లేకుండా తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా బాధ్యత తీసుకొని వివాదాలకు తావు లేకుండా ఎన్నికలు జరపాలన్నారు. ఎంఈవోలు వేణుగోపాలరావు,శివనాయుడుతో పాటు పలువురు హెచ్‌ఎంలు సమావేశంలో పాల్గొన్నారు.

పరీక్షల్లో మెరుగైన ఫలితాలు పొందాలి



విద్యార్థితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎస్.రాయవరం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు సూచించారు. గుడివాడ ఉన్నత పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులు తరగతుల్లో అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించడమే కాకుండా పోటీ పరీక్షలకు కూడా సిద్ధం కావాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. మరుగుదొడ్లు చూసి మరింత మెరుగ్గా పరిశుభ్రత పాటించాలని సూచించారు.

రైతుల హుషారు.. వరి నాట్ల జోరు

అన్నదాతకు ఖరీఫ్ కీలకమైన ఘట్టం... శ్రమించి ఏడాదికి సరిపడిన ధాన్యాన్ని పండించేందుకు తాపత్రయ పడే కాలమిది.. దమ్ము పట్టి మడులను తయారు చేయడం నుంచి మేలైన నారును సమకూర్చుకుని నాట్లు వేయడం వరకు రైతులకు పరీక్ష కాలం. ఇటీవలి వర్షాలకు చెరువుల్లో నీరు పుష్కలంగా చేరడంతో రైతుల్లో జోష్ పెరిగింది. పలుచోట్ల జోరుగా నాట్లు వేస్తున్నారు.

- ముమ్మరంగా పొలం పనులు
- అనుకూలంగా వాతావరణం
- వరి విస్తీర్ణం పెరిగే అవకాశం



వరినాట్లు వేస్తున్న కూలీలు



జల్లూరులో వరి నారు తీస్తున్న కూలీలు

కోటవురట్ల: ప్రస్తుతం వరినాట్లకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నాట్లు వేశాక అనుకూల వాతావరణంతో పాటు చీడపీడ తెగుళ్ల ఆశించకుండా పంటను కాపాడుకుంటూ, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను దక్కించుకుని ధాన్యాన్ని ఇంటికి చేరుస్తారు. అనుకున్నట్టు జరిగితే లాభాలు దరిచేరతాయి. అందుకోసం అన్నదాతలు పెద్ద యుద్ధమే చేస్తారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎక్కడ చూసినా నాట్లు పండగే కనిపిస్తోంది. రైతులు పరుగులు తీస్తుంటే కూలీలకు చేతినిండా పనిదొరకడంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారు. పలు ప్రాంతాలలో వరినాట్లు జోరుగా వేస్తున్నారు. ఎక్కడ చూసినా రైతులు, కూలీలు బిజీగా కనిపిస్తున్నారు. దమ్ములు పడుతూ, నారు తీస్తూ, నాట్లు వేస్తూ పరుగులు పెడుతున్నారు.

గత ఖరీఫ్‌లో...

గత ఏడాది ఖరీఫ్ సీజనులో పాయకరావుపేట నియోజకవర్గంలో 9,332 హెక్టార్లలో వరి సాగు జరిగింది. పాయకరావుపేట మండ లంలో 2760 హెక్టార్లు, నక్కపల్లి మండలంలో 2200 హెక్టార్లు, కోటవురట్ల మండలంలో 1750 హెక్టార్లు, ఎస్.రాయవరం మండలంలో 2622 హెక్టార్లలో వరి సాగు జరిగింది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రైతు లు ఉత్సాహంగా పొలం పనులు నిర్వహిస్తున్నారు.

వాతావరణం అనుకూలం

కోటవురట్ల మండలంలో జల్లూరు, యండపల్లి, బి.కె.పల్లి, పాములవాక, అన్నవరం, కైలాసపట్నం, రాజుపేట, కోటవురట్ల, లింగాపురం, కె.వెంకటాపురం, రామచంద్రపురం, నీలిగుంట, రామచంద్రపాలెం ప్రాంతాల్లో జోరుగా వరినాట్లు వేస్తున్నారు. వ్యవసాయాధికారులు రైతులను ప్రోత్సహిస్తూ పలు సూచనలు అందజేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో గత ఏడాది కంటే అధికంగా వరిసాగు జరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

మత్స్యకారులకు పరిహారం చెల్లించాలి



ఎంపీడీవోకి వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు, మత్స్యకార సంఘ నాయకులు

ఎస్.రాయవరం : మత్స్యకారులకు వేట నిషేధం సమయంలో ఇవ్వాల్సిన నగదు నేటి వరకు జమ కాలేదని, వెంటనే జమచేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు మత్స్యకారులు, ఆయా గ్రామ సర్పంచ్‌లు సోమవారం ఎంపీడీవో సత్యనారాయణమూర్తికి వినతి పత్రం అందజేశారు. మే నెలలో అందాల్సిన వేట నిషేధం నగదు ఆగస్టు వచ్చినా ఇవ్వకడం దారుణమన్నారు. గత ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తుండగా కొత్తగా అధికారంలోనికి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ.20వేలు ఇస్తామని చెప్పారని, కానీ ఇంత వరకూ స్పందించలేదని అన్నారు. ఆ నగదు పడక పోగా ఇటీవల వరుస తుపానులతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేదని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, కొప్పిశెట్టి సత్యం,దూళి శ్రీనుబాబు, మైలపల్లి శ్రీనివాసరావు,వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వమ్మవరం ఎంపీటీసీ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో విజయం సాధించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : ఈనెల 8న జరగనున్న స్కూల్ కమిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి పాటిపల్లి మోడల్ స్కూల్ పరిధిలోని గ్రామాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. స్కూల్‌కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించడంతో పాటు విద్యాభివృద్ధికి పాటుపడే వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. తల్లిదండ్రులతో సమావేశమై ఎన్నికలో విజయం సాధించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పాటిపల్లి సర్పంచ్ ఆదారి కృష్ణవేణి త్రిమూర్తులు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, మద్దాల వీరునాయుడు, ఇల్లా శిరీషా నాగేశ్వరరావు, పార్టీ నేతలు దాసరి అప్పారావు, కోనపల్లి రామ్మోహనరావు, రాపేటి పరమేష్, పిట్టా మంగారెడ్డి చందనాటి శ్రీనివాసరావు,కారుకొండ రాజు, బొడ్డేడ మహేష్ పాల్గొన్నారు.

బెజవాడ, విస్సులకు పరామర్శ



మంగయ్యమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు, పార్టీ నాయకులు

యలమంచిలి రూరల్ : మాతృ వియోగం పొందిన యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వర్రావును సోమవారం మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు పరామర్శించారు. ధర్మవరంలో నాగేశ్వర్రావు తల్లి మంగయ్యమ్మ పెద్దకర్మ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు బెజవాడ నాగేశ్వర్రావు ఇంటికి వెళ్లి ఆయన తల్లి మృతికి సంతాపం తెలిపారు. ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే పట్టణానికి చెందిన ఉపాధ్యాయ సంఘం నేత కొణతాల విశ్వేశ్వర్రావు(విస్సు) తల్లి అమ్మాజీ ఇటీవల మరణించడంతో ఆయన ఇంటికి వెళ్లిన కన్నబాబు ఉపాధ్యాయుడు విస్సుకు తన సానుభూతి తెలిపారు. కన్నబాబు వెంట ఎంపీపీ బోదెపు గోవింద్, మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్,వైస్ ఎంపీపీ రాజాన శేషు,వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర,గొట్టుముక్కల శ్రీనుబాబు, రంగా సాయి,దూది నర్సింహమూర్తి, కర్రి శివ,దాసరి కుమార్,కోడిగుడ్డు రమణ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికత వెల్లి విరియాలి



ఆధ్యాత్మిక కార్యక్రమాలపై రాంబిల్లిలో సమావేశమైన సమరసత ఫౌండేషన్ సభ్యులు

రాంబిల్లి (యలమంచిలి) : పవిత్రమైన శ్రావణమాసం తరుణంలో ప్రతి ఇంటా ఆధ్యాత్మికత తలపించేలా పూజలు జరగాలని యలమంచిలి సమరసత ఫౌండేషన్ ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు ఆకాంక్షించారు. సోమవారం రాంబిల్లిలో ఒక ఆలయం వద్ద సమరసత ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 16 నుండి 22 వరకు రక్షాబంధన్ ఘనంగా జరుపుకోవాలన్నారు. దేవాలయాల్లో భజన, ప్రతి పౌర్ణమికి సామూహిక హారతి , ఏకాదశినాడు నగర సంకీర్తన, ప్రతి రెండో శనివారం సత్సంగం జరుగుతూ ఉండాలని రాంబిల్లి మండల సమరసత సేవా ఫౌండేషన్ సంయోజకులు సూరాడ నూకరాజు అన్నారు. కార్యక్రమంలో యర్రయ్య, చింతకాయల గగన్ కుమార్, చక్రవర్తి, శ్రీను, శెశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా



ఎమ్మెల్యే విజయకుమార్‌ను కలిసిన వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు

మునగపాక : యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను సోమవారం మునగపాక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు కలిశారు. ఈ నెల 10న మునగపాకలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న ద్వారబంధం కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడు తూ దేవాలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందజేస్తామన్నారు. ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో దిమ్మల అప్పారావు,సూరిశెట్టి రాము,దాడి ముసిలినాయుడు.టెక్కలి పరశురామ్,డాక్టర్ బద్దెం సూర్యనారాయణ,కాండ్రేగుల జగ్గారావు,ఆడారి కృష్ణ,పెంటకోట ఉమేష్, ఆడారి లక్ష్మణరావు,బొడ్డేడ రామునాయుడు,దాడి శివ పాల్గొన్నారు.

హాస్య నటుడు అప్పారావుకు సత్కారం



టీవీ నటుడు అప్పారావును సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : టీవీ నటుడు జబర్దస్త్ అప్పారావుకు సోమవారం ఘన సత్కారం నిర్వహించారు. శ్రావణ మాసంలో భాగంగా అప్పారావు మండలంలోని పుణ్యక్షేత్రాలైన టి. సిరసపల్లిలోని వీరభద్ర స్వామి ఆలయం, వెంకటాపురంలోని పరమేశ్వరుని ఆలయాలను ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావును వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ, మాజీ సర్పంచ్ కనకప్పారావు, ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం, అనకాపల్లి నూకాంభిక అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ బీఎస్ఎంకే జోగినాయుడు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు తదితరులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. శ్రావణమాసంలో పుణ్యక్షేత్రాలను దర్శించుకునే భాగ్యం తనకు దక్కిందని ఈ సందర్భంగా అప్పారావు అన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా



సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటిస్తున్న ఎంపీడీవో

ఎస్.రాయవరం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీవో సత్యనారాయణమూర్తి సోమవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన జరగాల్సిన సమావేశం పోరం సరిపడా రాకపోవడంతో సమావేశం ప్రారంభించడానికి వీలు కుదరలేదని ఎంపీడీవో చెప్పారు. ఈ సమావేశం మరో తేదీన సభ్యులతో చర్చించి నిర్వహిస్తామన్నారు. అయితే పలు గ్రామాల సర్పంచ్‌లు, పలు శాఖ అధికారులు సమావేశం వాయిదా పడడంతో సమావేశ మందిరం నుంచి వెనుతిరిగారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళాల వెల్లువ



గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక : మండలంలోని మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి పలువురు దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. ఈ నెల 19న ఆలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకుంటున్నారు. గాజువాకకు చెందిన ఆడారి వెంకట్రావు,గోవిందరావు, రామకృష్ణ అచ్చియ్యనాయుడులు కలిసి రూ,50,116 నగదును విరాళంగా అందజేశారు. మూలపేటకు చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మొల్లేటి నూకరాజు–ఉమా సుబ్బలక్ష్మి దంపతులు రూ.51,111 నగదును ఆలయ నిర్వాహకులకు విరాళంగా అందజేశారు.

సమైక్య కృషితో ఎమ్మెల్సీగా పార్టీ అభ్యర్థిని గెలిపించాలి

వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలతో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు



పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి రూరల్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(కన్నబాబు) పార్టీ నాయకులను కోరారు. సోమవారం యలమంచిలి పార్టీ కార్యాలయంలో ఆయన నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఆయనను కలవడానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో మాట్లాడారు. 2021లో జరిగిన ప్రాదేశిక ఎన్నికల్లో యలమంచిలి నియోజకవర్గంలో అత్యధికంగా 57 ఎంపీటీసీలు, జెడ్పీటీసీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు గెలుపొందారన్నారు. కాబట్టి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి నాయకులంతా శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. నియోజకవర్గానికి చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ మద్దతుతో గెలిచిన గ్రామ సర్పంచ్‌లను బస్సుల్లో పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు తాడేపల్లికి తీసుకెళ్తానన్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి ఎవరూ నిరాశ చెందవద్దన్నారు. ఉత్సాహంగా పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి మన సత్తా చాటాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత మూటకట్టుకుంటున్నారన్నారు. రాబోయే కాలంలో వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్,వైస్ ఎంపీపీ రాజాన శేషు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర,గొట్టుముక్కల శ్రీనుబాబు, రంగా సాయి,దూది నర్సింహమూర్తి,కర్రి శివ,కోన లచ్చంనాయుడు,బలిరెడ్డి శ్రీను, జువ్వాలనాయుడు,అంకిరెడ్డి నర్సింగరావు,మళ్ల కొండబాబు,సుంకర మరిణేశ్వర్రావు, పిట్టా సత్తిబాబు,కాళ్ల సీతారాం,దాసరి కుమార్,కోడిగుడ్డు రమణ పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠం



సీతంపాలెంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం



తులసీనగర్‌లో తల్లిపాల విశిష్టత గురించి అవగాహన కల్పిస్తున్న మహిళా ఉద్యోగులు

నక్కపల్లి : తల్లిపాలతోనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని గర్భిణులకు, బాలింతలకు సోమవారం చైతన్యం కలిగించారు. మిషన్ వందరోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం సీతంపాలెం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీతంపాలెం క్లస్టర్ పరిధిలో గల గ్రామాల్లో వివిధ కార్యక్రమాలను అంగన్‌వాడీ సిబ్బంది సంయుక్తంగా చేపట్టారు. స్థానిక ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్ ఆచార్యులు మాట్లాడుతూ తల్లిపాలలోని పోషకాలు బిడ్డకు ఎందుకు అవసరమో వివరించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, తల్లుల సమక్షంలో అంగన్‌వాడీ సిబ్బంది సిబ్బంది చేపట్టిన ఆకృతి పలువురిని ఆకట్టుకుంది. సచివాలయ సిబ్బంది బ్యూలారాణి మాట్లాడుతూ శిశువు పుట్టినప్పటి నుంచి ఆరునెలలు వరకు తల్లిపాలు తప్పక ఇవ్వాలన్నారు. ఆధునిక పోకడల వల్ల నేటి రోజుల్లో కొందరు తల్లులు ముర్రుపాలు బిడ్డకు ఇవ్వడం లేదన్నారు. అలాంటివారిలో చైతన్యం కలిగించడం కోసమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని తెలిపారు. తల్లిపాలలో గల అధిక పోషక విలువలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో తల్లులు, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, సత్యవతి, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మి, అమ్మాజీ, గర్భిణులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: పట్టణంలోని తులసీనగర్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్‌లు, ఏఎన్‌ఎంలు,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, మహిళా పోలీసులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లిపాల విశిష్టత గురించి గర్భిణులు,బాలింతలకు అవగాహన కల్పించారు. అలాగే బేటీ బచావో బేటీపడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల్ని చదివించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా పోలీసు పిళ్లా సంతోషికుమారి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో ఓ మోస్తరు వర్షం

ఎస్.రాయవరం: మండల కేంద్రంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం సమయంలో ఆకస్మికంగా వర్షం కురిసింది. పి.ధర్మవరం , సర్వసిద్ధి, లింగరాజుపాలెం గ్రామాల నడుమ ఒక్కసారిగా పెద్ద వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి.

పొలం పనులు

వరిలో కాలి బాటలు తప్పక తీయాలి



దేవవరంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో ఉమా ప్రసాద్

నక్కపల్లి : వరిలో పంట వేస్తున్న రైతులు పొలాల్లో తప్పకుండా కాలి బాటలు తీయాలని మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన పలు గ్రామాల్లో పొలం బడి నిర్వహించారు. మండలంలో సుమారు 4400 ఎకరాలు సాధారణ సాగు కాగా, సరిపడా వరి నారు వేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటివరకు సాధారణ వర్షాపాతం 453 మి.మి కాగా 380 మి.మీ పడిందన్నారు. అందుబాటులో వున్న చెరువు నీటితో ఆయా గ్రామాల్లో చినరామభద్రపురం, దేవవరం, డొంకాడ, కాగిత, దోసలపాడు, ఉద్దండపురం గ్రామాల్లో వరి నాట్లు మొదలు పెట్టారన్నారు. ఇప్పటివరకు సుమారు 850 ఎకరాల్లో వరి నాట్లు వేయడం జరిగిందన్నారు. వరి నారు తీసే వారం రోజులు ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు ఐదు సెంట్లు వరి నారుమడిలో 800 గ్రాములు ఇసకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. నాట్లు వేసుకునేటప్పుడు కొనలు తుంచి నాటుకోవాలని, దమ్ము చేపట్టి ఎకరానికి ఎరువులు సింగిల్ సూపర్ ఫాస్పేట్ 150 కేజీలు, యూరియా 30 కేజీలు, 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ దమ్ములో తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. నాలుగు నుంచి ఆరు ఆకులు వున్న నారును ఉపయోగించాలని, చ.మీ.కు 33 మూనలు వుండేలా చూసుకోవాలని తెలిపారు. నాటిన తరువాత ప్రతి 2 మీటర్లకు 20 సె.మీ బాటలు తీయాలని, దీనివల్ల పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడపీడలు ఉధృతి తగ్గుతుందన్నారు. క్షేత్ర పర్యటనలో ఏఈఓ ఒ. సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్ సురేంద్ర పాల్గొన్నారు.

నారుమడులు నష్టపోయిన రైతులకు విత్తనాలు



నారుమడులు నష్టపోయిన రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న రాంబిల్లి వ్యవసాయాధికారిణి సుమంత

రాంబిల్లి(యలమంచిలి) : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో వరి నారు మడులు దెబ్బతిని నష్టపోయిన రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందజేయడం జరుగుతుందని రాంబిల్లి మండల వ్యవసాయాధికారిణి సుమంత అన్నారు. సోమవారం రాంబిల్లి మండలంలో దిమిలి, కట్టుబోలు, మురకాడ, కొప్పుగుండుపాలెం గ్రామాల్లోని నష్టపోయిన రైతులకు రాయితీపై ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నారుమడులకు 50 క్వింటాళ్ల ఆర్‌జియల్,-2537 శ్రీకాకుళం సన్నాలు రకం విత్తనం 80 శాతం రాయితీపై రైతులకు అందజేయడం జరుగుంతుందని అలాగే 30 కేజీల విత్తనాల బస్తా 250కి అందజేయడం జరుగుతుందని,వరి నారుమడులు దెబ్బతిన్న రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించి విత్తనాలు పొందాలని ఆమె కోరారు.